అవసరం మేరకే సెల్‌ఫోన్ వినియోగించాలి

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 5: సెల్ ఫోన్ అవసరం మేరకు మాత్రమే వినియోగించాలని, అతిగా వాడితే అనర్థాలు తప్పవని కరీంనగర్ రెండో టౌన్ మహిళా సీఐ శ్రీ లక్ష్మి సూచించారు. శనివారం నగునూర్ ఎస్వీఆర్ ఉన్నత పాఠశాలలో ఆనందం విద్య, వినోదం కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సైబర్ నేరాల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు కరాటే బెల్ట్‌లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ డాక్టర్ ఎం. విజయ మోహన్‌రెడ్డి, కరస్పాండెంట్ డాక్టర్ ఆర్.యాకయ్య, డైరెక్టర్లు డాక్టర్ పీఆర్ రాజేందర్, డాక్టర్ జి. ప్రశాంత్, డాక్టర్ కే శ్యాంసుందర్, మేనేజింగ్ డైరెక్టర్ బి. ఉపేందర్, లాయర్ హేమలత, హెచ్ఎం కె. చుక్కారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్ష కిలోమీటర్ల రథయాత్రను విజయవంతం చేయాలి

వీణవంక, ఏప్రిల్ 5: లక్ష కిలోమీటర్ల 'మా భూమి రథయాత్ర' విజయవంతం చేయాలని ధర్మసమాజ్ పార్టీ మండలాధ్యక్షుడు రమేశ్ పిలుపునిచ్చారు. శనివారం పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కరపత్రాలు ఆవిష్కరించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యాధికార జేపీసీ, ధర్మ సమాజ్ పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బహిరంగ సభతో రథయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కుమార్, అనిల్, సదానందం, వినయ్, వినోద్, రాజు, పృథ్వీరాజ్, రవికిరణ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సుడా మాస్టర్ ప్లాన్ సిద్ధం

- అభ్యంతరాల స్వీకరణకు నోటిఫికేషన్ జారీ
- 90 రోజుల గడువు
- నగరానికి 200 ఫీట్లతో రింగ్ రోడ్డుకు ప్రతిపాదన
- పట్టణాల్లో ప్రధాన రోడ్లకు ఇరువైపులా కమర్షియల్ జోన్లే

కార్పొరేషన్, ఏప్రిల్ 5: కరీంనగర్ శాతవాహన అర్బన్ అథారిటీకి సంబంధించిన మాస్టర్ ప్లాన్ సిద్ధమైంది. 2041 అవసరాలను దృష్టిలో పెట్టుకొని అమృత్ స్కీమ్ గైడ్ లైన్స్, అర్బన్ డెవలప్‌మెంట్ ప్లాన్స్ ఫార్ములేషన్ అండ్ ఇంప్లిమెంటేషన్ (యూడీపీఎఫ్ఐ) మార్గదర్శకాలను అనుసరించి ఈ మాస్టర్ ప్లాన్‌ను అభివృద్ధి చేశారు. సుడా పరిధిలో 62 గ్రామాల్లోని 622 చదరపు కిలోమీటర్లను పరిగణనలోకి తీసుకొని ఆయా గ్రామాల పరిస్థితులు, పట్టణాల అవసరాల మేరకు ఈ మాస్టర్ ప్లాన్ తయారు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి గత నెల 29న నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ మాస్టర్ ప్లాన్‌పై అభ్యంతరాలను స్వీకరించేందుకు 90 రోజుల గడువు ఇచ్చారు.

సుడా పరిధిలోని అన్ని గ్రామాలను రెసిడెన్షియల్, అర్బనైజేషన్‌గా పేర్కొనడంతో పాటు, సుడా విస్తీర్ణం చుట్టూ రింగ్‌రోడ్డుకు ప్రతిపాదనలు చేశారు. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో అన్ని ప్రధాన రోడ్లకు ఇరువైపులా పూర్తి కమర్షియల్ ఏరియాగా ప్రతిపాదించారు. వీటితో పాటు సుడా పరిధిలో 2289 హెక్టార్లను ఇండస్ట్రియల్ జోన్‌గా మార్చారు. నగరపాలక సంస్థ చుట్టూ ఉన్న గ్రామాలను రెసిడెన్షియల్ ఏరియాగా ప్రతిపాదించగా.. సుడా చుట్టూ ఉన్న గ్రామాలను అర్బనైజేషన్ ఏరియాలుగా ప్రతిపాదించారు. వీటితో పాటు 20 గ్రామాలను కలుపుతూ కొత్తగా రింగ్ రోడ్డు కోసం అధికారులు ఈ మాస్టర్ ప్లాన్‌లో ప్రతిపాదనలు చేశారు.

సుడా పరిధి అంతా అర్బనైజేషన్

శాతవాహన అర్బన్ అథారిటీ పరిధిలోకి వచ్చే గ్రామాల్లో అత్యధికంగా రెసిడెన్షియల్ జోన్‌గా, మిగిలిన ప్రాంతాలన్ని అర్బనైజేషన్ జోన్‌గా పేర్కొన్నారు. కొలిమికుంటలో కొంత ఏరియా, రుక్మాపూర్, జూబ్లీనగర్, మద్దనూర్, ఇరుకుల్ల, అన్నారం, మన్నెంపల్లి, నుస్తులాపూర్, కొత్తపల్లి కొంత ఏరియా, నేదునూర్, రేణికుంట, పరువెల్ల, మైలారం గ్రామాలను అర్బన్ జోన్‌గా ప్రతిపాదించగా.. నగరంలో విలీనం అయిన దుర్శేడ్, మల్కాపూర్, గోపాల్‌పూర్, చింతకుంటతో పాటు మానకొండూర్, తిమ్మాపూర్, ఈదులగుట్టపల్లి, పొరండ్ల గ్రామాలను రెసిడెన్షియల్ ఏరియాగా గుర్తించారు. సుడాకు నలువైపులా ఇండస్ట్రియల్ జోన్ ఏర్పాటు చేయాల్సి ఉండగా కేవలం రెండు వైపులా మాత్రమే ఇండిస్ట్రియల్ జోన్‌లను గుర్తించారు. అసిఫ్‌నగర్, ఒద్యారం, నాగులమల్యాల కొంత భాగం, ఎలగందుల, బద్దిపల్లి ప్రాంతాలను, మానకొండూర్ వైపు చెంజర్ల కొంత భాగాన్ని ఇండస్ట్రియల్ ఏరియాలుగా గుర్తించారు.

సుడా చుట్టూ రింగ్‌రోడ్డుకు ప్రతిపాదన

భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని కరీంనగర్‌కు అధికారులు 200 ఫీట్ల విస్తీర్ణంతో రింగ్ రోడ్డును ప్రతిపాదించారు. సుమారు 138 కిలోమీటర్ల మేర రింగ్‌రోడ్డు నిర్మించనున్నారు. జగిత్యాల రోడ్డులో కొత్తపల్లి శివారు నుంచి కొక్కెరకుంట, జూబ్లీనగర్, ఎలబోతారం, ఇరుకుల, దుర్శేడ్, బొమ్మకల్ మీదుగా మానకొండూర్, ముంజంపల్లి, పొరండ్ల మీదుగా నుస్తులాపూర్ వద్ద హైదరాబాద్ రాజీవ్ రహదారిని కలుపుతారు. రాజీవ్ రహదారి నుంచి గునుకుల కొండాపూర్, మదాపూర్, పారువెల్ల, ఒద్యారం, నాగులమల్యాల, వెలిచాల మీదుగా జగిత్యాల రోడ్డు వరకు కలుపుతూ రింగ్‌రోడ్డుకు ప్రతిపాదనలు చేశారు. దీనివల్ల రవాణా వ్యవస్థ వేగంగా మారేందుకు అవకాశం ఉంటుందని అధికారవర్గాలు చెబుతున్నాయి.

మాస్టర్ ప్లాన్ మ్యాప్

ప్రధాన రోడ్లన్ని కమర్షియల్ ఏరియాలే

కరీంనగర్ నగరపాలక సంస్థలోని ప్రధాన రోడ్లకు ఇరువైపులా ఉన్న ప్రాంతాలను పూర్తిగా కమర్షియల్ జోన్లుగా గుర్తించారు. నగరానికి చుట్టూ ఉన్న రేకుర్తి వరకు, మానకొండూర్ వరకు, అల్గునూర్ చివరి వరకు, చింతకుంట వరకు ఉన్న ప్రధాన రోడ్లకు ఇరువైపులా కమర్షియల్ ఏరియాగా పేర్కొన్నారు. అలాగే గ్రామాల్లోని ప్రధాన రోడ్లను మిక్స్‌డ్ జోన్లుగా ప్రతిపాదించారు. వీటితో ఆయా గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న రోడ్లను విస్తరించాలని ఆదిలో ప్రతిపాదించినా కామారెడ్డి మాస్టర్ ప్లాన్ విషయంలో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో ముందు జాగ్రత్తగా దానిని మినహాయించారు. కరీంనగర్‌లో మాత్రం అనేక ప్రాంతాల్లో భారీగానే మార్పులు జరిగాయి. ముఖ్యంగా సుడా మాస్టర్ ప్లాన్ విషయంలో పెద్ద ఎత్తున ప్రచారం చేయాల్సి ఉన్నా అధికారులు మాత్రం ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు.

నిషేధాజ్ఞలు కొనసాగింపు: సీపీ గౌష్ ఆలం

కరీంనగర్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ) : సాధారణ పౌరులు, మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో బహిరంగ మద్యపానంతో పాటు డీజే, డ్రోన్ల వినియోగంపై ఉన్న నిషేధాజ్ఞలు కొనసాగిస్తున్నట్లు సీపీ గౌష్ ఆలం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే అమలులో ఉన్న ఈ ఆజ్ఞలు ఈ నెల 30 వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. అలాగే సంబంధిత ఏసీపీల అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించరాదని పేర్కొన్నారు. ఇతరులను గాయపర్చే విధంగా ఉండే వస్తువులు, మారణాయుధాలను ధరించి సంచరించకూడదని తెలిపారు. ఈ ఉత్తర్వులు ఈ నెల 30 వరకు అమలులో ఉంటాయని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై హైదరాబాద్ నగర పోలీసు చట్టం 1348 ఫసలీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై ఐపీసీ 188 హైదరాబాద్ నగర పోలీసు చట్టం ఫసలీ నిబంధనలను అనుసరించి చర్యలు తప్పవని సీపీ స్పష్టం చేశారు.

సీతారాముల కల్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తి


ఆలయ ఆవరణలో వేసిన చలువ పందిళ్లు

ఇల్లందకుంట, ఏప్రిల్ 5: అపర భద్రాద్రిగా పేరుగాంచిన ఇల్లందకుంట సీతారామ చంద్రస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే కల్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవం జరుగనుండగా, రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు. కాగా, 7న పట్టాభిషేక మహోత్సవం, 8న గరుడ వాహనసేవ, 9న హనుమత్ వాహన సేవ, 10న గజవాహనసేవ, 11న అశ్వ వాహన సేవ, 12 సూర్యరథోత్సవం (చిన్న రథం), 13న చంద్ర రథోత్సవం (పెద్దరథం), 14న చంద్ర రథంపై స్వామి వార్ల దర్శనం, 15న చక్రతీర్థం, పుష్పయాగం, 16న సప్తవర్ణాలు, ఏకాంత సేవ కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగిస్తాయని ఆలయ ఈవో సుధాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

దళితజాతి అభివృద్ధి ప్రదాత బాబూ జగ్జీవన్‌రాం

- మానకొండూర్ ఎమ్మెల్యే, బాబు జగ్జీవన్‌రాం జయంత్యుత్సవ కమిటీ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ

కలెక్టరేట్, ఏప్రిల్ 5 : అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అనేక ఆధారాలతో పార్లమెంటులో పోరాడి, దళితజాతి అభివృద్ధి ప్రదాతగా మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రాం నిలిచాడని, మానకొండూర్ ఎమ్మెల్యే, బాబు జగ్జీవన్‌రాం జయంత్యుత్సవ కమిటీ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ కొనియాడారు. బాబూ జగ్జీవన్‌రాం 118వ జయంత్యుత్సవాలు శనివారం నగరంలోని మంచిర్యాల చౌరస్తాలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, చదువే దళితుల అభివృద్ధికి దోహదపడుతుందని, బాబూ జగ్జీవన్‌రాం జీవితం స్పష్టం చేస్తుందన్నారు. అణగారిన వర్గాల అభివృద్ధి కోసం తమ జీవితాలను ధారబోసిన మహనీయుల ఉత్సవాలు జరుపుకోవడంలో నిర్లక్ష్యం వహించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు వేళకు వచ్చినా, దళిత సోదరులు మాత్రం నామమాత్రంగానే హాజరవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, జాతీయోద్యమ పోరాటంలో బాబూ జగ్జీవన్‌రాం చేసిన అవిరాళమైందన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, బాబూ జగ్జీవన్‌రాం చదువుపై అత్యంత శ్రద్ధ చూపుతూ, కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడాడని గుర్తుచేశారు. అంతకుముందు పలువురు దళిత, బహుజన నాయకులు మాట్లాడుతూ, దళితుల అభివృద్ధిపై పాలకులు చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదని విమర్శించారు. ఎస్సీ కార్పొరేషన్ నిధులు, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులపై గతంలో గగ్గోలు పెట్టిన నాయకులు, ప్రస్తుత ప్రభుత్వంలో ఎటువైపు మళ్లిస్తున్నారో చెప్పాలని ఓ మహిళా నాయకురాలు ప్రశ్నించారు. అంతకుముందు కులాంతర వివాహాలు చేసుకున్న ఆరు జంటలకు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూ.2.5 లక్షల చొప్పున చెక్కులు అందజేశారు. జగ్జీవన్‌రాం కాంస్య విగ్రహానికి ఎమ్మెల్యేలు కవ్వంపల్లి, మేడిపల్లితో పాటు కలెక్టర్ పమేలా సత్పతి, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, సీపీ గౌష్ ఆలం, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు సత్తు మల్లేశ్, ఆర్డీవో కె.మహేశ్వర్‌తో పాటు పలువురు అధికారులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

'దళితులపై చిన్నచూపు'

జగ్జీవన్‌రాం జయంత్యుత్సవ సమావేశంలో విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడు మేడి మహేశ్ మాట్లాడుతూ, దళిత మహనీయుల జయంత్యుత్సవాలకు జిల్లా మంత్రి, ఇన్‌చార్జి మంత్రి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హాజరు కాకపోవడం, దళితులను చిన్నచూపు చూస్తున్నారనేందుకు నిదర్శనమన్నారు. ఆహ్వానపత్రికలో మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఫొటో ముద్రించకపోవడం, స్థానిక ఎమ్మెల్యేగా ఆయనను అవమానించడమేనన్నారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన జ్యోతిభాపూలే, అంబేద్కర్ విగ్రహాల ముసుగులు తొలగించడంలో నిర్లక్ష్యం వహించడం వెనుక ఆంతర్యమేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు డా.బాబాసాహెబ్ అంబేద్కర్ పేరు నామకరణం చేసినా, ఆయన కాంస్య విగ్రహం బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేయడం లేదని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో నగర శివారులోని చింతకుంట గ్రామపరిసరాల్లో రూ.6 కోట్లతో అంబేద్కర్ భవనం నిర్మించినా, ఇప్పటివరకు ఎందుకు వినియోగంలోకి తేవడం లేదని ప్రశ్నించారు. నగరంలోని భాగ్యరెడ్డి వర్మ కూడలి సుందరీకరణపై సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డికి పలుమార్లు విన్నవించినా, పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో పాలకులు పూర్తిగా వైఫల్యం చెందుతున్నారని పలువురు వక్తలు మండిపడ్డారు. కొద్ది మాసాల క్రితం కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామంలో జరిగిన ఓ దళిత యువకుడి హత్య కేసులో నిందితులపై ఇప్పటివరకు కఠిన చర్యలు తీసుకోకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు.

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

మూడు మాసాల క్రితం నగర శివారులోని బొమ్మకల్ గ్రామంలో తమ కుమారుడు బెజ్జంకి అనిల్‌ను దారుణంగా చంపిన ఘటనలో నిందితులైన ఇద్దరిపై కఠిన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలంటూ, మృతుడి తల్లిదండ్రులు బెజ్జంకి ఎల్లయ్య, లక్ష్మి డిమాండ్ చేస్తూ, సమావేశంలో ఫ్లెక్సీ ప్రదర్శించారు. కాగా, దీనిపై తాము ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెబుతూ, బాధిత వృద్ధులను నాయకులు సమావేశం నుంచి పక్కకు పంపించారు.

నగరంలో జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

గంగాధరలో జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

ఘనంగా జయంతి వేడుకలు

కార్పొరేషన్/ తెలంగాణచౌక్/ ముకరంపుర/ వీణవంక/ మానకొండూర్/ గంగాధర/ జమ్మికుంట/ కరీంనగర్ రూరల్/ హుజూరాబాద్ టౌన్/ శంకరపట్నం/ చిగురుమామిడి, చొప్పదండి, ఏప్రిల్ 5 : మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రాం జయంతి వేడుకలు శనివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని ఆయన విగ్రహానికి బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, పార్టీ శ్రేణులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ భూక్యా తిరుపతి నాయక్, బీఆర్ఎస్ నాయకులు చందు, షౌకత్, సాయికృష్ణ, అరె రవి గౌడ్, చేతి చంద్రశేఖర్, ఎడబోయిన శ్రీనివాస్ రెడ్డి, గంటల రేణుక, నాగుల కిరణ్ కుమార్ గౌడ్, పబ్బతి శ్రీనివాస రెడ్డి, నయీమ్ తదితరులు పాల్గొన్నారు. కుల వివక్ష పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు జగ్జీవన్‌రాం జయంతి వేడుకల్లో జిల్లా అధ్యక్షుడు తిప్పారపు నరేశ్ పాల్గొని నివాళులర్పించారు. ఇక్కడ నాయకులు కనకయ్య, నాగరాజు ఉన్నారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో బాబూ జగ్జీవన్‌రాం చిత్రపటానికి కరీంనగర్ జోనల్ ఈడీ సోలోమన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి ఎస్ఈ మేక రమేశ్ బాబు పూలమాల వేసి నివాళులర్పించారు. వీణవంక మండల కేంద్రంతో పాటు మండలంలోని ఎలుబాక, మామిడాలపల్లి, చల్లూరు గ్రామాల్లో బాబూ జగ్జీవన్‌రాం జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో సింగిల్‌విండో చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. మానకొండూర్ మండల కేంద్రంలో జగ్జీవన్‌రాం విగ్రహానికి బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, రైతు ప్రజా సంఘాల జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గంగాధర మండల కేంద్రంలో బాబూ జగ్జీవన్‌రాం విగ్రహానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ వేర్వేరుగా పూలమాల వేసి నివాళులర్పించారు. జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రాం చిత్రపటానికి కమిషనర్ ఎండీ అయాజ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లి గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బాబూ జగ్జీవన్‌రాం చిత్రపటానికి మాజీ ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. హుజూరాబాద్ పట్టణంలోని సైదాపూర్ కూడలి, అంబేద్కర్ కూడలిలో నిర్వహించిన జగ్జీవన్‌రాం జయంతి వేడుకల్లో నాయకులు పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, ప్రజా సంఘాల నాయకులు వేల్పుల రత్నం, ఉప్పు శ్రీనివాస్, చంద్రశేఖర్, మోరె మధు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. శంకరపట్నం మండల కేంద్రంలో బాబూ జగ్జీవన్‌రాం జయంతి వేడుకల్లో ఎంపీడీవో కృష్ణప్రసాద్, ఎస్ఐ రవి పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి నర్సయ్య, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బొజ్జ రవి, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు. చిగురుమామిడి మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద బీఆర్ఎస్, ధర్మ సమాజ్ పార్టీల ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య, ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు తాళ్ల నరేశ్, రాజిరెడ్డి, కిరణ్, భరత్, సదానందం, పరశురాముడు తదితరులు పాల్గొన్నారు. చొప్పదండి పట్టణంలో అంబేద్కర్ విగ్రహం వద్ద, మున్సిపల్ కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రాం జయంతి సందర్భంగా మున్సిపల్ కమిషనర్ నాగరాజు, మార్కెట్ చైర్మన్ కొత్తూరి మహేశ్ ఘనంగా నివాళులర్పించారు. అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

దేవాలయాలు మానవతా వికాస కేంద్రాలు

జాతీయ సాహిత్య పరిషత్ పూర్వ జాతీయ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి

కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 5: దేవాలయాలు మానవతా వికాస కేంద్రాలుగా విలసిల్లుతున్నాయని, ప్రజలకు, జీవకోటికి సేవలందించేలా మన పూర్వీకులు ఆలయాలను రూపొందించారని జాతీయ సాహిత్య పరిషత్ పూర్వ జాతీయ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. జాతీయ సాహిత్య పరిషత్ కరీంనగర్ జిల్లా శాఖ శనివారం కొత్తపల్లిలోని చిన్న గుట్టపై వెలసిన స్వయంభూ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో వసంతోత్సవం పేరుతో శ్రీ వేంకటేశ్వర వైభవంపై కవి సమ్మేళం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కొత్తపల్లిలో వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాశస్త్యాన్ని వివరించారు. జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు గాజుల రవీందర్ సభాధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, ప్రజ్ఞ భారతి చైర్మన్ డాక్టర్ లెక్కల రాజభాస్కర్ రెడ్డి, జాతీయ సాహిత్య పరిషత్ తెలంగాణ అధ్యక్షుడు వడ్లూరి ఆంజనేయరాజు, నరహరి నారాయణరెడ్డి, బండ గోపాల్ రెడ్డి, కొత్తపల్లి పూర్వ సర్పంచ్ వాసాల రమేశ్, నరహరి జగ్గారెడ్డి మాట్లాడారు. సంస్థ ప్రధాన కార్యదర్శి నంది శ్రీనివాస్ సమన్వయం చేసిన ఈ కవిసమ్మేళనంలో ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యుడు డాక్టర్ కలువకుంట రామకృష్ణ, కొత్త అనిల్, స్తంభంకాడి గంగాధర్, ముత్తినేని శ్రీనివాస్, శ్రీనివాస జియ్యంగార్, నీలగిరి అనిత, ఎర్రోజుల రాజమౌళి, కటుకోజ్వల మనోహరాచారి, అనాసి జ్యోతి, సామల కిరణ్, మందల నగేశ్ రెడ్డి, ఎలగందుల సత్యనారాయణ, సముద్రాల నాగేశ్వరరావు, జనార్దన్ రెడ్డి, కె.ఎస్.అనంతాచార్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ వేంకటేశ్వర స్వామిని స్తుతిస్తూ కవిత్వగానం చేసిన 122 మంది కవులను ఘనంగా సత్కరించారు.

'మృతుడి వివరాలు తెలిస్తే సమాచారం ఇవ్వండి'

ప్రమాదానికి ముందు సీసీ పుటేజీలో వ్యక్తి కదలికలు

హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 5: హుజూరాబాద్ మండలం సింగాపూర్ గ్రామంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన వ్యక్తి వివరాలు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని హుజూరాబాద్ టౌన్ సీఐ తిరుమల్ గౌడ్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. లారీ ప్రమాదంలో మరణించిన వ్యక్తికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. ప్రమాద సమయంలో వ్యక్తి ఆరెంజ్ కలర్ షర్టు, వైట్ ప్యాంటు ధరించాడని తెలిపారు. సదరు యువకుడి వివరాలు తెలిస్తే 8712670773/ 7569919123 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

మానేరులో క్యాట్-2025 అవార్డుల ప్రదానోత్సవం

జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మానేరు విద్యా సంస్థల అధినేత కడారి అనంతరెడ్డి

కొత్తపల్లి, ఏప్రిల్ 5 : కరీంనగర్ పద్మనగర్‌లోని మానేరు సీబీఎస్ఈ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం సాయంత్రం మానేరు క్యాట్- 2025 పోటీ పరీక్షలకు సంబంధించిన నగదు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మానేరు విద్యాసంస్థల ఆధ్వర్యంలో మార్చిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా క్యాట్ 2025 పరీక్షను 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించగా సుమారు 1500 మందికి పైగా హాజరయ్యారు. తరగతుల వారీగా మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నగదు అవార్డులను ప్రకటించారు. సాయంత్రం మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు వరుసగా రూ. 5వేలు, రూ. 3వేలు, రూ. 2వేల విలువైన చెక్కులను స్పెక్ట్రోఫి ఐఐటీ, నీట్ ఫౌండేషన్ సీఏవో ఎన్ కృష్ణయ్యా నర్వా, మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి ప్రదానం చేశారు. మానేరు విద్యాసంస్థల అధినేత అనంతరెడ్డి మాట్లాడుతూ, క్యాట్ పోటీ పరీక్షను నిర్వహించడం ఇది 3వ సారి అని, మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు సుమారు లక్ష ఇరవై వేల వరకు నగదు అవార్డులను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెక్ట్రోఫి ఫౌండేషన్ సీఎస్ఎం మనుక రజినీకాంత్, మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతరెడ్డితో పాటు ప్రిన్సిపాల్‌లు, వైస్ ప్రిన్సిపాల్‌లు, అకాడమిక్ ఇన్‌చార్జిలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.


శంకరపట్నం: ముత్తారం గ్రామ శివారులో రోడ్డుపై పారుతున్న కాలువ నీరు

వృథాగా సాగు నీరు..

శంకరపట్నం, ఏప్రిల్ 5: ముత్తారం గ్రామంలో ఎస్సారెస్పీ ఉప కాలువ గుండా పారే సాగు నీరు వృథాగా పోతున్నది. గ్రామ శివారులో ఎల్లమ్మ గుడి సమీపంలోని ఉప కాలువ కల్వర్టు వద్ద చెత్తా చెదారం చేరడంతో కాలువ నీరు రోడ్డుపై ప్రవహిస్తున్నది. ఓ వైపు సాగు నీరు అందక పంటలు ఎండిపోయే ప్రమాదం పొంచి ఉండగా, మరోవైపు అధికారుల నిర్లక్ష్యంతో కోతకు వచ్చిన పంటల గుండా నీరు ప్రవహిస్తుండడంతో తాము నష్టపోవాల్సిన పరిస్థితి తలెత్తిందని రైతులు వాపోతున్నారు.

చెత్తా చెదారంతో మూసుకుపోయిన ఎస్సారెస్పీ ఉప కాలువ

మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులదే బాధ్యత

శంకరపట్నం, ఏప్రిల్ 5: మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులే బాధ్యత వహించాలని ఎస్ఐ రవి హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలను నడుపుతున్న మైనర్లపై దృష్టి సారించారు. నంబర్ ప్లేట్లు లేని, మైనర్లు డ్రైవింగ్ చేస్తున్న 14 మోటార్ బైక్‌లను సీజ్ చేశారు. సాయంత్రం తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను పీఎస్‌కు పిలిపించి ఎస్ఐ రవి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇక్కడ పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్‌కు అభినందనలు

విద్యానగర్, ఏప్రిల్ 5: ఎన్నో సామాజిక సేవలు, లఘు చిత్రాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్న ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్ పసుల రవికుమార్ తారా అకాడమీ ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా జాతీయ సాహిత్యరత్న పురస్కారాన్ని అందుకోగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ కమిషనర్ శ్రీనివాసరావు శనివారం ఎక్సైజ్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. అలాగే వేములవాడ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎక్సైజ్ కానిస్టేబుల్ హెడ్ కానిస్టేబుల్ అసోసియేషన్ అధ్యక్షుడు పులి నగేశ్‌గౌడ్, ఎల్లారెడ్డిపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, తిమ్మాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సాయిబాబ, ఆఫీస్ సూపరింటెండెంట్ సతీశ్, హెడ్‌కానిస్టేబుల్ మోసిన్, కానిస్టేబుల్ యుగంధర్ పాల్గొన్నారు.

కన్నాపూర్ కార్యదర్శికి రోడ్డు ప్రమాదంలో గాయాలు

శంకరపట్నం, ఏప్రిల్ 5: మండలంలోని కన్నాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేశ్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. జమ్మికుంటకు చెందిన రాజేశ్ శనివారం సాయంత్రం విధులు ముగించుకుని తిరిగి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా ఆముదాలపల్లి శివారులో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఆముదాలపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద రోడ్డుపై పడి ఉన్న రాజేశ్‌ను అటువైపు వెళ్తున్న రైతులు రోడ్డు పక్కకు తీసుకెళ్లి 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ సిబ్బంది అతడిని చికిత్స కోసం దవాఖానకు తరలించారు. అయితే ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs
★ Wanted Sales Executives @ Karimnagar, Unic Chem Technologies to make Best Future in Water Treatment Plants & Chemicals. Ph: 9573244611, raju@unicchem.com
NT-330931
HOUSE FOR SALE

★ కమర్షియల్ బిల్డింగ్ అమ్మబడును, కరీంనగర్ విద్యారణ్యపురి రోడ్ నెం-1 లోని ఆర్యన్ హాస్పిటల్ వెనుక బిల్డింగ్ 4 గుంటలు అమ్మబడును. Cont: ఆర్యన్ హాస్పిటల్ నందు సంప్రదించగలరు.
NTK-337565

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.